క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులఎంపిక



కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నర్సిములు తెలిపారు. జిల్లా కేంద్రంలో అండర్-15 వాలీబాల్ విభాగంలో పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన విద్యార్థులు పల్లవి, మౌనిక, జగదీష్ సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ నీలిమా వర్ధిని, పీడీ సాదిక్‌తోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

12వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్థానిక రైతులు అశోక్, ఆశప్ప, గజలప్ప, రాజు, రాములు, భీంషప్పలు పాల్గొని మాట్లాడారు. బలవంతపు భూ సేకరణ ఆపాలని, న్యాయమైన పరిహారం అందించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి మాజీ సర్పంచ్ భీంరెడ్డి, హన్మయ్య, బాలకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ నరేష్‌గౌడ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



దామరగిద్ద: మండలంలోని విఠలపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సీఎచ్ చంద్రయ్య టీవీని వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బాలమురళీ ఉపాధ్యాయులు వారి సేవలను అభినందించారు. విద్యార్థులు డిజిటల్ పాఠ్యాంశాల బోధనకు టీవీ ఎంతగానో ఉపయోగ పడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా సరఫరా

నర్వ: మండలంలో రైతులకు యూరియాను పారదర్శకంగా పంపిణీ చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 13,500 బస్తాల యూరియాను రైతులకు అందించామన్నారు. మంత్రి సహకారంతో గత సీజన్ కంటే అదనంగా 50 శాతం యూరియాను అందించినట్లు తెలిపారు. లంకాల్ గ్రామానికి చెందిన రైతు అనారోగ్యంతో కేంద్రానికి రాలేకపోవడంతో ఇంటి వద్దనే 20 బస్తాలను అందించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యావసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు అందించారన్నారు. సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పీఏసీఎస్ సిబ్బంది సర్వీస్ అందిస్తారన్నారు. సమావేశంలో ఏఓ అఖిలారెడ్డి, సీఈఓ ఉదయ్ కుమార్ తదితరులున్నారు.

దయాకర్‌రెడ్డి సేవలు మరవలేనివి

మక్తల్/నర్వ: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి ఎనలేని కృషిచేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం దయాకర్‌రెడ్డి జయంతిని ఆయన అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం కేక్ కట్‌చేసి అభిమానులకు పంపిణీ చేశారు.

గుడిసె కూలి ఎద్దులకు తీవ్ర గాయాలు



మరికల్: మండలంలోని తీలేర్ గ్రామంలో వర్షాలకు గుడిసె కూలిపోవడంతో రెండు ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటన్న తన పొలం దగ్గర ఆదివారం రాత్రి గుడిసెలో రెండు ఎద్దులను కట్టెసి ఇంటికి వచ్చాడు. రాత్రి వర్షం కురిసి గుడిసె కూలిపోవడంతో ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. పశు వైద్యసిబ్బందికి సమాచారం అందించడంతో ఎద్దులను పరిశీలించారు.

బస్ ఎక్కాలంటే.. నడి రోడ్డే దిక్కు

- బస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం



టైరోడ్డులో బస్‌షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపై అవస్థలు పడుతున్న ప్రయాణికులు (ఫైల్)

కృష్ణా: మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు, 16 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడి నుండి రాష్ట్ర రాజదాని హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాయచూర్, గుల్బర్గా, యాద్గీర్, మక్తల్ అలాగే పొరుగు రాష్ట్రం కర్ణాటకకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వీరందరూ బస్సులలో రాకపోకలు సాగించాలంటే రోడ్డుపైనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నిలబడాల్సి వస్తుంది. ఎందుకంటే మండల కేంద్రంలో ఇప్పటి వరకు సరైన బస్టాండ్ లేదు. దీంతో మండలవాసులు వేరే ఊర్లకు వెళ్లాలంటే బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపైనే ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో రోడ్డుపై నిల్చోని బస్సుల కోసం పరిగెత్తి ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

వృద్ధులకు తప్పని అవస్థలు

నిబంధనల ప్రకారం జాతీయ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్ తప్పని సరిగా ప్రయాణికుల అవసరం నిమిత్తం జాతీయ రహదారికి అటు, ఇటు రెండు వైపులా షెల్టర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మండలకేంద్రలో రెండు జాతీయ రహదారులు గుల్బర్గా-రాయచూర్, జడ్చర్ల-రాయచూర్ హైవేలు మండలకేంద్రం నుంచి వెళ్తుండడంతో కర్ణాటక నుంచి అనేక మంది ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి నుంచి అనేక మంది వ్యాపారులు, కూలీలు కర్ణాటకకు వెళ్తుంటారు. వీరంతా ఎక్కడికి వెళ్లాలన్నా నడి రోడ్డుపైన అవస్థలు పడాల్సిందే. ఇక వృద్ధులైతే బస్సు వచ్చే దాక రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నాయకులు స్పందించాలి

పనుల నిమిత్తం రోజూ ఇతర గ్రామాలకు వెళ్తుంటాం. దీంతో బస్సు కోసం టైరోడ్డులో వానొచ్చినా, ఎండ కాసినా అవస్థలు పడుతూ రోడ్డుపైనే బస్సు కోసం ఎదురుచూడాల్సిందే. బస్‌షెల్టర్ లేకపోవడంతో వృద్ధులు నిలబడలేక అవస్థలు పడుతున్నారు. నాయకులు స్పందించి టైరోడ్డులో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి.

-సంగప్పగౌడ, కృష్ణా గ్రామం

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారిని నిర్మించిన కాంట్రాక్టర్ ఇక్కడి ప్రయాణికుల అవసరం నిమిత్తం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మిగితా చోట్ల ఏర్పాటు చేశాడు. కానీ ఇక్కడ మాత్రం ఏర్పాటు చేయలేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు కూడా విన్న వించాం. అయినా పట్టించుకోవడం లేదు.

-నారాయణ, గుడెబల్లూర్ గ్రామం

కలెక్టర్ దృష్టికి సమస్య

రెండు హైవేలు కలుసుకునే టైరోడ్డులో బస్ షెల్టర్ ఏర్పాటుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటా. ఇది నేషనల్ హైవే కాబట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తాను. ఇక మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి స్థానిక నాయకులే చర్యలు తీసుకోవాలి.

- లావణ్య, నారాయణపేట డిపో మేనేజర్

జల దిగ్బంధంలోనే గ్రామాలు



మాగనూర్‌లో పెద్దవాగు వంతెనపై నుంచి పారుతున్న వరద

మాగనూర్: మండలంలోని పెద్ద వాగు, చిన్న వాగు పొంగి పొర్లుతున్నాయి. వారం రోజులుగా కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో పాటు మాగనూర్ మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని నేరడగం, అడవిసత్యారం గ్రామాల పరిధిలోని పెద్దవాగులు వంతెనతో పాటు చిన్న వాగు వంతెనపై నుంచి వరద పారుతుండటంతో నేరడగం, ఉజ్జెల్లి, వర్కూర్, బైరంపల్లి, అడవిసత్యావార్, కోల్పూర్, మందిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా పెద్ద వాగు పరివాహక ప్రాంతంలో పంటలు పూర్తిగా నీట మునిగాయి. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆరు గేట్లు తెర్చుకోవడంతో నేరడగం వంతెనపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో వాగు దగ్గర పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు.

ఊట్కూర్‌లో భారీ వర్షం

ఊట్కూర్: మండలంలో గత 4 రోజులుగా కురుస్తున్న వర్షానికి సోమవారం తెల్లవారు జామున పెద్దచెరువు అలుగు పారింది. చెరువు కింద సుమారు 800 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే చెరువు కింద రైతులు వరిపంట సాగు చేశారు. చెరువు అలుగు పారితే రెండు పంటలు వరిసాగు చేయడానికి నీరుసరిపోతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణా నదికి పోటెత్తిన వరద

కృష్ణా: భారీ వర్షాలకు మండలంలో కృష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి కూడా సోమవారం రాత్రికి 2 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో నది ప్రవాహక ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ ఎండీ నవీద్ సిబ్బందితో నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఇడ్లూర్ వాగుకు వరద ప్రవాహం

మక్తల్: మండలం పరిధిలోని వాగులకు వరద ఉధృతి పోటెత్తడంతో పలు గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించారు. అదే విధంగా కర్ణాటక-ఇడ్లూర్ వాగు నుంచి నీటి ప్రవాహం అధికం కావడంతో సంగంబండ రిజర్వాయర్ నీటి మట్టం నిండు కుండలా మారింది. దీంతో బ్యాక్ వాటర్ సోమేశ్వర్‌బండ గ్రామం వరకు చేరుకుంది.



సంగంబండ రిజర్వాయర్‌లో భారీగా వరద నీరు

స్తంభించిన రాకపోకలు

కొత్తపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భూనీడు-మద్దూరు మధ్యలో వాగు ఉధృతంగా పారుతుండటంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు వాగు దాటే సాహసం చేయొద్దని ఎస్ఐ విజయ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా నీలకంఠస్వామి ఉత్సవాలు



మద్దూరులో స్వామి కలశ ఊరేగింపు

మద్దూరు: శ్రావణమాస చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మద్దూరులో నీలకంఠస్వామి ఉత్సవాలను కురిహీణశెట్టి (జాంద్రసంఘం) ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం జల్దిబిందె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నీలకంఠుడికి అభిషేకం, విశేషపూజలు జరిపించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవా నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్, భాస్కర్, గోవిందు, శ్రీను, శివశంకర్, చంద్రశేఖర్, భరత్, విఠల్, శ్రీనివాస్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలు

మద్దూరు పుర శివారులోని వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాల మధ్య కలశ ఊరేగింపు చేపట్టారు.

వైభవంగా జల్ది బిందె ఊరేగింపు

నారాయణపేట రూరల్: పట్టణంలో జల్ది బిందె ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. బహార్‌పేట్ నీలకంఠ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల గుండా మహిళలు మంగళ హరతులతో ఊరేగింపు చేపట్టారురు. అనంతరం బిల్వార్చన, అష్టోత్తరపూజలు, పుష్పాలంకరణ, నైవేద్యం మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

రామలింగేశ్వరస్వామి రథోత్సవం

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గుట్టపై వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవ వేడుకలు భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు.



నారాయణపేటలో స్వామివారి పల్లకీ సేవ

సాయంత్రం రథానికి రంగురంగుల పూలతో అలంకరించి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి దేవాలయం చుట్టూ రథాన్ని భక్తులు లాగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నసూరయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, డాక్టర్ ప్రాణేష్, వన్నెకారి శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాఘవరెడ్డి, రాంరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవయజ్ఞం నిర్వహణ

ఊట్కూర్: ఊట్కూర్‌లోని భవాని మందిర్‌లో సోమవారం శ్రావణ మాసం సందర్భంగా దేవ యజ్ఞం నిర్వహించారు. అంతకు ముందు భవాని మాతకు ప్రత్యేక పూజలు జరిపించారు.యజ్ఞ-యాగాల వల్ల వాతావరణం శుద్ధి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు చౌద్రి అశోక్, రాధబాయి, దత్తురావు, చందులాల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో నీలకంఠేశ్వర స్వామి పల్లకి సేవా కార్యక్రమాన్ని స్థానిక కురిని శెట్టి జాంద్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



నందికోలు ఆడుతున్న యువకులు

పంటల నమోదు చేపట్టాలి

దామరగిద్ద: ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా పంటల నమోదు చేపట్టాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బసిరెడ్డిలు డిమాండ్ చేశారు. పంటల నమోదు ఆధారంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టేందుకు ఇబ్బందులు తలెత్తె అవకాశం ఉందన్నారు. నూతన విధానం పేరుతో పంటల నమోదు ఆలస్యం చేయడం పట్ల రైతులు సాగు చేసిన పంటలను అమ్ముకునేందుకు అవస్థలు పడే అవకాశం ఉందన్నారు. అకాల వర్షాలకు మండలంలో కంది సాగు పూర్తిగా దెబ్బతిని పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అధికారులతో సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

మాగనూర్/దామరగిద్ద: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టంబర్-1న పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు బలరాం అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యంలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ-టీఎస్ శాఖ నాయకులు తిరుపతి, తిమ్మన్న, నర్సింహారెడ్డి, శ్రీనివాసులు బాబు రెడ్డి, శ్రీను, చారి, ఉపాధ్యాయులు ఇందురాణి, సంధ్య, రమ మహేశ్వరి, విజయలక్ష్మి, నాగసుధ, అనిత, రాజేశ్వరి, ఝాన్సీ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



కోస్గి రూరల్: కొడంగల్ నియోజకర్గ ముదిరాజ్ నాయకులు సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్టంలో ముదిరాజులు అన్ని కులాల కన్నా అత్యధిక జనాబా ఉండి ఆర్థికంగా సామాజికంగా వెనుబడి ఉన్నారని జీఓ నంబరు 15ను అమలు చేసి ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్, నియోజకర్గ నాయకులు వేణుగోపాల్, వెంకటయ్య, నర్సప్ప, బాలయ్య, సత్యపాల్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



నారాయణపేటలో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎలిగండ్లలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి జరుపుకుంటున్న నాయకులు



మక్తల్‌లో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు జరుపుకొంటున్న గౌడ సంఘం నేతలు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ ముద్దు బిడ్డ బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి గౌడ సంఘం నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ తురుష్కుల దౌర్జన్యాలను వ్యతిరేకించి ప్రజల తరపున ఎన్నో పోరాటాలు చేశారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ గీత కార్మిక సంఘం నాయకులు శ్యాంసుందర్ ,రవికుమార్ గౌడ్ ,వెంకటేష్ , లక్ష్మయ్య గౌడ్, ఆనంద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కాంతు గౌడ్ ,నారాయణ గౌడ్, లక్ష్మయ్యగౌడ్, భరత్ , దామోదర్ , బుగ్గయ్య గౌడ్ పాల్గొన్నారు.

బురదమయంగా ఆర్టీసీ ప్రాంగణం

మరికల్: ఇటీవల కురిసిన వర్షాలకు మరికల్ ఆర్టీసీ బస్టాండ్ గుంతల మయంగా మారింది. దీంతో బస్సులను బస్టాండ్‌లోకి తీసుకురావాలంటెనే డ్రైవర్లు జంకుతున్నారు. బస్టాండ్ ఆవరణంతా అడుగు, అడుగున్నర ఉన్న గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేయాల్సినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం హయంలో బస్టాండ్ ఆధునీకీకరణ కోసం నిధులు మంజురైనా సకాలంలో పనులు ప్రారంభించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్‌లో నిలిచిన మురుగు నీరు

విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలి

నారాయణపేట రూరల్: జిల్లాలో కురుస్తున్న అకాల వర్షల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సెలవులు ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గౌస్ కోరారు. వర్షంలో తడుస్తూ విద్యార్థులు పాఠశాల, కళాశాలకు రావడం ఇబ్బందిగా ఉంటుందని చాలా చోట్ల లోలెవెల్ వంతెనలపై నీరు ప్రవహిస్తున్నందున రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు సైతం తమ పిల్లలకు విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని భయపడుతున్నట్లు వాపోయారు. కాబట్టి కలెక్టర్, డీఈఓలు స్పందించి విద్యాసంస్థలకు సెలవు ఇవ్వాలని కోరారు.

నేడు టీఎల్‌ఎం మేళా

దామరగిద్ద: స్థానికంగా లభించే నోకాస్ట్ లోకాస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి తయారు చేసే బోధనోపకరణల ప్రదర్శన మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాజరై మేళాను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

మరికల్: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈఓ మీర్జా కరీముల్లా అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో సోమవారం మండల స్థాయి బోధనాభ్యసన సామగ్రి మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను అర్థం చేసుకొని వారికి అర్థవంతమయ్యే భాషలో బోధన సాగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం మేళాలో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరత్నమ్మ, బాల నారాయణ, గోవర్ధన్‌గౌడ్, అర్జున్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా ఏర్పాటు

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎఫ్‌ఎల్‌ఎన్ టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మేళాలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. మండల విద్యాశాఖ అధికారి గాయత్రి వాటిని పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రదర్శనను జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, హెచ్‌ఎం శంకరయ్య, నరసింహచారి, మల్లికార్జున్, శ్రీనివాసులు, రాజేశ్వర్, రామకృష్ణ, రమేష్ సీఆర్‌పీలు నారాయణ, వెంకట్రాములు, శ్వేత, శృతి, ఆంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ కరీముల్లా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ సూచించారు. మండలంలోని పేరపల్ల వాగు పరిసరాల్లో వరద పరిస్థితులను స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం పరిశీలించారు. వరద ఉధృతి పెరిగితే నారాయణపేటకు రాకపోకలు సాగించడానికి ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందని, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: ఉమ్మడి మద్దూరు మండల పరిదిలో భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయరాములు సూచించారు. కొత్తపల్లి-భూనీడు మధ్యలో ప్రవహిస్తున్న వాగును సోమవారం ఆయన పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గే వరకు పరిసర ప్రాంత వాసులు రాకపోకలు చేసే సాహసం చేయొద్దని సూచించారు. ఎంఆర్ఐ శ్రావణ్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట వరినాట్లు వేసి నిరసన

మరికల్: మండలంలోని పస్పుల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, మాజీ వైస్ ఎంపీపీ రవి కోరారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ఎదుట వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల చుట్టూ నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాల చుట్టు డ్రైయినేజీ నిర్మించి వర్షపు నీరు నిలువ కుండా ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో రవి, నరసింహ రెడ్డి, తిమ్మయ్యగౌడ్, మతిన్, నర్సిములుగౌడ్, రామస్వామి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరినాట్లు నాటుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శిథిలావస్థకు పాఠశాల భవనం



మాగనూర్: మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాలలో తగరతి గదితో పాటు స్టాఫ్ రూంలో పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారం నుంచి కురుస్తున్న వర్షాలతో భవనాలు ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే పాఠశాల భవనానికి మరమ్మతు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

నాయకుల అభినందనలు

నారాయణపేట టౌన్: దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామానికి చెందిన గవినోళ్ల శ్రీనివాస్‌ను జిల్లా తెలంగాణ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమించడం అభినందించాల్సిన విషయమని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబండ నర్సిములు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో కాలనీకి రోడ్డు సౌకర్యం

నారాయణపేట: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు పట్టణంలోని 9 వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతమైన ప్రతిభ కాలేజీ బ్యాక్ సైడ్ కాలనీలో బ్రిడ్జి పై నుంచి వర్షపు నీరు ప్రమాదకరంగా పారడంతో కాలనీకి రాకపోకలు నిలిచి పోయాయి. ఈ విషయం కాలనీ వాసులు ఫోన్ ద్వారా నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణికారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారి సూచన మేరకు సోమవారం హుటాహుటిన జిల్లా నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బ్రహ్మానందరెడ్డి ఇతర అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీ వాసులు రాకపోకలు కొనసాగించడానికి ప్రత్యామ్నాయంగా రోడ్డును చదును చేసి మట్టి వేయించారు. టీయుఎఫ్ఐడీసీ నిధులతో బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ఎక్కువగా బయట తిరొగొద్దని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు.

